హోటల్ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్‌లో..

ప్రశ్న: హోటల్ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ చేశాను. ఈ కోర్సు చేసినవాళ్లకు ట్రావెల్ అండ్ టూరిజం రంగంలో ఉండే ఉద్యోగావకాశాల గురించి తెలియజేయగలరు. ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్స్ ఏమైనా ఉంటాయా? - శ్రీకీర్తి

■ హోటల్ మేనేజ్‌మెంట్/ టూరిజంలో ఎంబీఏ చేసినవాళ్లు చాలామంది అందుబాటులో ఉన్నప్పటికీ.. నిపుణుల కొరత ఎక్కువగానే ఉంది. ఈ డిగ్రీ చేసినవాళ్లు ట్రావెల్ ఏజెంట్, టూర్ మేనేజర్, టూర్‌గైడ్, వీసా ఎగ్జిక్యూటివ్, ట్రావెల్ కన్సల్టెంట్, హోటల్ మేనేజర్, మేనేజ్‌మెంట్ ట్రైనీ, హాస్పిటాలిటీ మేనేజర్, సేల్స్ మేనేజర్, హౌస్‌కీపింగ్ మేనేజర్, గెస్ట్ ఎక్స్‌పీరియన్స్ మేనేజర్, ఈవెంట్ మేనేజర్, బెవరేజ్ మేనేజర్, హాలిడే కన్సల్టెంట్, కేటరింగ్ మేనేజర్‌గా ఉద్యోగాలు చేసే

అవకాశం ఉంది. ఈ కోర్సు చదివినవారికి హోటల్, హాస్పిటల్, ట్రావెల్ ఏజెన్సీలు, విమానయాన సంస్థలు, రిసార్ట్‌ల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయి. ఈ సంస్థలు అన్నింటిలో ఇంటర్న్‌షిప్ అవకాశాలు కూడా ఉన్నాయి. సాధారణంగా హోటల్ మేనేజ్‌మెంట్/టూరిజం ఏంబీఏ కోర్సులో భాగంగా ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. ఇంటర్న్‌షిప్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా అదే సంస్థలో ఉద్యోగం లభించే అవకాశమూ ఉంది. చాలా సంస్థలు ఇంటర్న్‌షిప్ చేసేవారికి స్టైపెండ్ కూడా ఇస్తున్నాయి.

- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

సివిల్స్ ప్రిలిమ్స్.. ఇదిగో వ్యూహం!

యూపీఎస్‌సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రక్రియలో ప్రిలిమినరీకి చాలా ప్రాధాన్యం ఉంది. దీనిలో అర్హత సాధిస్తేనే తర్వాతి అంచె.. మెయిన్స్ రాయగలుగుతారు. ప్రిలిమ్స్ పరీక్షను ఈ ఏడాది మే 28న నిర్వహించబోతున్నారు. ఇప్పుడున్న వ్యవధిలో ఈ పరీక్షకు సమగ్రంగా ఎలా సన్నద్ధం కావాలో తెలుసుకుందాం.

సివిల్స్‌లో తొలి మెట్టు అయిన ప్రిలిమ్స్‌లో ఎక్కువమంది అభ్యర్థులు అర్హత సాధించలేరు. ఎందుకంటే... ఏ ప్రాతిపదికన ప్రశ్నలను రూపొందిస్తారనే విషయంలో వారికి అంతగా అవగాహన ఉండదు. ప్రశ్నపత్రం ఆబ్జెక్టివ్ టైప్‌లో ఉంటుంది కాబట్టి ప్రిలిమ్స్ పాసవడం సులువైనదని అపోహ పడుతుంటారు. అందుకే ప్రిలిమినరీ పరీక్ష తీరుపై సరైన అవగాహన పెంచుకోవటం ముఖ్యం.

సివిల్స్‌కు సంబంధించి యూపీఎస్సీ సైద్ధాంతిక లక్ష్యాలే మిటో చూద్దాం. వాటిని దృష్టిలో పెట్టుకునే ప్రశ్నపత్రాన్ని రూపొందిస్తారు.

- జ్ఞానం, నైపుణ్యాలను సాధించాలని నిరంతరం పరితపించే అభ్యర్థులను ఎంచుకోవడం.
- భావోద్వేగపరంగా సివిల్ సర్వీసెస్‌ను అభిమానించే వాళ్లను గుర్తించడం.
- ప్రజాసేవకు అవసరమైన ప్రాథమిక విశ్లేషణాత్మక సామర్థ్యం అభ్యర్థులకు ఉందో లేదో తెలుసుకోవడం.
- పై లక్ష్యాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని అభ్యర్థుల సంఖ్యను తగ్గించటం.

పేపర్-1, పేపర్-2లలో అభ్యర్థుల ప్రతిభను పరీక్షించడం ద్వారా ఈ లక్ష్యాలను సాధిస్తారు.

ప్రశ్నల రూపకల్పన వెనుక...

- అభ్యర్థి ప్రాథమిక పరిజ్ఞానాన్ని పరీక్షించేందుకు కరెంట్ అఫైర్స్ కొలమానంగా ప్రశ్నలు అడుగుతారు. వీటి ద్వారా వర్తమానాంశాలపై అభ్యర్థికి ఉన్న అవగాహనను తెలుసుకుంటారు.
- జాతీయ, అంతర్జాతీయ అంశాల్లో అభ్యర్థికి ఉండే ఆసక్తిని పరీక్షిస్తారు. ప్రజలు ఎదుర్కొంటోన్న సమస్యలు, వాటి పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలు, వీటి పట్ల అభ్యర్థి స్పందనను పరీక్షిస్తారు.
- జాతీయంగా, అంతర్జాతీయంగా ప్రాధాన్యాన్ని సంతరించుకున్న కార్యక్రమాలు. అవి సామాన్య ప్రజలపై చూపే ప్రభావంపై ప్రశ్నలు ఇస్తారు.
- భవిష్యత్తు కార్యక్రమాలపై ప్రభుత్వ వైఖరి, వాటి సాధనకు చేస్తోన్న కృషిపై అభ్యర్థికి ఉండే అవగాహనను పరీక్షించే ప్రశ్నలు అడుగుతారు.
- ప్రశ్నలు కనీస తార్కిక పరిజ్ఞానాన్ని, విశ్లేషణ సామర్థ్యాన్ని పరీక్షిస్తాయి. ఎందుకంటే ఈ నైపుణ్యాలు భవిష్యత్తులో అభ్యర్థి పనితీరునూ ప్రభావితం చేస్తాయి.

ప్రిలిమినరీ ఎలా ఉంటుంది?

సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలో రెండు పేపర్లుంటాయి. జనరల్ స్టడీస్ పేపర్-1, జనరల్ స్టడీస్ పేపర్-2. ప్రతి పేపర్‌కూ 200 మార్కులు. పేపర్-1లో 100 ప్రశ్నలు, ప్రతి సరైన సమాధానానికీ 2 మార్కులు. పేపర్-2లో 80 ప్రశ్నలు, ప్రతి సరైన సమాధానానికీ 2 1/2 మార్కులు. నెగెటివ్ మార్కులూ ఉంటాయి. ప్రతి తప్పు సమాధానానికీ 0.33 శాతం మార్కులు తగ్గిస్తారు.

ముఖ్యమైన విషయం ఏమిటంటే.. పేపర్-2లో 33 శాతం మార్కులు సాధిస్తే సరిపోతుంది. అంటే 200 మార్కులకు కనీసం 67 మార్కులు సంపాదించాలి. ఈ మార్కులు సాధించకపోతే తిరస్కరణకు గురైనట్టే. పేపర్-2లో కటాఫ్ మార్కుల కంటే ఎక్కువ సంపాదిస్తే.. పేపర్-1ను పరిశీలిస్తారు. దీనిలో సాధించిన అత్యధిక మార్కుల ఆధారంగానే.. రిజర్వేషన్ పాలసీని అమలు చేసి మెరిట్ లిస్టును తయారుచేస్తారు.

పేపర్-I సిలబస్: ఏ సబ్జెక్టులో ఎన్ని ప్రశ్నలు?

సివిల్స్ ప్రిలిమ్స్ సిలబస్ చాలా జనరల్‌గా ఉంటుంది. నిర్దిష్టత లేనట్టు అర్థమవుతుంది. అందుకే ఏ సబ్జెక్టులో ఏ అంశాలు వస్తాయో అవగాహన రావాలంటే... గత కొన్నేళ్లలో వచ్చిన ప్రశ్నలను విశ్లేషించటమే మార్గం.

సబ్జెక్టు	ప్రశ్నల సంఖ్య (సగటున)						
	2016	2017	2018	2019	2020	2021	2022
1. కరెంట్ అఫైర్స్	42	32	17	08	06	06	16
2. జనరల్ నాలెడ్జ్	08	03	05	04	03	01	00
3. హిస్టరీ ఆఫ్ ఇండియా అండ్ ఇండియన్ నేషనల్ మూవ్‌మెంట్	12	13	19	15	20	20	15
4. ఇండియన్ పాలిటీ అండ్ గవర్నెన్స్	08	24	15	13	11	18	11
5. జనరల్ సైన్స్	03	03	06	14	12	12	13
6. ఎకనామిక్ అండ్ సోషల్ డెవలప్‌మెంట్	08	05	14	17	24	15	18
7. ఇండియన్ అండ్ వరల్డ్ జాగ్రఫీ	06	08	12	16	14	08	17
8. ఎన్విరాన్‌మెంటల్ ఎకాలజీ	13	12	12	13	10	20	10

కరెంట్ అఫైర్స్ ప్రశ్నలు కొన్నిసార్లు నేరుగా అడిగితే.. మరికొన్నిసార్లు సబ్జెక్టుల్లోనూ కరెంట్ అఫైర్స్ కోణం కనిపిస్తుంది. పరీక్షలో ఈ విభాగానికి ఎక్కువ ప్రాధాన్యం ఉంది. అందువల్ల శ్రద్ధ వహించాలి.

ఇవీ లక్ష్యాలు...

సివిల్స్ ప్రిలిమ్స్ అభ్యర్థి నిర్దేశించుకోవాల్సిన లక్ష్యాలు.....

- పేపర్-2లో కనీస మార్కులు సాధించాలి. అప్పుడే పేపర్-1లో పొందిన మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు.
- పేపర్-1లో 100కు 40 కచ్చితమైన జవాబులు ఉండేలా సన్నద్ధం కావాలి.
- మరో 15 ప్రశ్నలకు సమాధానాలు సరిగ్గా ఊహించి రాసే నైపుణ్యం సంపాదించాలి.
- సమాధానాల విషయంలో గుడ్డిగా అంచనాలు వేయకుండా స్వీయ క్రమశిక్షణను పాటించాలి.
- ఒత్తిడికి గురై తెలియని ప్రశ్నలకూ సమాధానాలు రాసేయకుండా అప్రమత్తత పాటించాలి.

అభ్యర్థి సరైన సన్నద్ధత వ్యూహానికి.. మౌలిక అంశాల నుంచి మొదలుపెట్టడం ఎంతో అవసరం. సిలబస్‌ను సమగ్రంగా పరిశీలించి ప్రశ్నపత్రంలో వస్తున్న ధోరణులను అర్థం చేసుకోవాలి.

పరీక్షకు ఎలా సన్నద్ధం కావాలి?

- మొదటిసారిగా పరీక్షకు హాజరయ్యేవారికి సిలబస్ అంశాలు కొత్తగా అనిపించవచ్చు. పదో తరగతి తర్వాత సాధారణంగా ఇంజినీరింగ్/సైన్స్ లేదా కామర్స్ సబ్జెక్టులను ఎంచుకున్న అభ్యర్థులు ఉంటారు. ఇవన్నీ కొత్త సబ్జెక్టులే కాబట్టి ప్రాథమికాంశాలపై పట్టు సాధించడం అవసరం. ఆ తర్వాత గతంలో అడిగిన ప్రశ్నలను అర్థం చేసుకోవాలి.
- ప్రశ్నల తీరు ఏటా మారుతూ ఉంటుంది. కాబట్టి ప్రశ్నల రూపకల్పన విధానం మీద అవగాహన పెంచుకుని ప్రతి విభాగంలోని వర్తమానాంశాల మీదా దృష్టి సారించాలి.
- చదవడానికి వేసుకున్న ప్రణాళికను కచ్చితంగా పాటిస్తూ వెళ్లాలి. సన్నద్ధత తీరును సమీక్షించుకుంటూ.. అవసరమైన మార్పులూ, చేర్పులూ చేసుకోవాలి.
- రెండో దశలో ఒక విభాగం మొత్తాన్నీ పూర్తిచేయాలి. ఉదాహరణకు ఇండియన్ పాలిటీ. దీంట్లో పరీక్ష పెట్టుకుని ఎన్ని మార్కులు సాధించారో చూసుకోవాలి. 75 శాతం మార్కులు సంపాదించినట్లయితే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కొంత సమయం తర్వాత అదే విభాగంలో మరోసారి పరీక్ష పెట్టుకుని మార్కులు చూసుకోవాలి. మళ్లీ 75 శాతం వచ్చినట్లయితే.. మరో సబ్జెక్టు అయిన ఎకనామిక్స్‌లోకి వెళ్లొచ్చు. మళ్లీ స్వీయ మూల్యాంకనం చేసుకోవాలి.
- ఈ విధానం పూర్తయిన తర్వాత గ్రాండ్ టెస్టులు రాయాలి. వీటిలో నెగెటివ్ మార్కులను తగ్గించిన తర్వాత కనీసం 65 శాతం స్కోర్ సాధించాలి.
- మొదటిసారిగా పరీక్ష రాసే అభ్యర్థులు ఈ 65 శాతం చాలా తక్కువ మార్కులు కదా అనుకోవచ్చు. కానీ ఇవి స్థిరంగా సాధిస్తుంటే మీరు విజయ పథంలో ఉన్నట్లే.
- ఈ వ్యూహాన్ని పాటించినట్లయితే.. ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాసి పేపర్-1లో మంచి స్కోరు సాధించవచ్చు.

పేపర్-2

జనరల్ స్టడీస్ పేపర్-2నే సీశాట్‌గా వ్యవహరిస్తుంటారు. ఈ పేపర్‌లో కింది సిలబస్ నుంచి 80 ప్రశ్నలు వస్తాయి.

పేపర్-2 (200 మార్కులు) సమయం: 2 గంటలు

1. కాంప్రహెన్షన్
2. ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్
3. లాజికల్ రీజనింగ్ అండ్ ఎనలిటికల్ ఎబిలిటీ
4. డెసిషన్ మేకింగ్ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్
5. జనరల్ మెంటల్ ఎబిలిటీ
6. బేసిక్ న్యూమరసీ (నంబర్స్ అండ్ డెయిర్ రిలేషన్స్, ఆర్డర్స్ ఆఫ్ మేగ్నిట్యూడ్.. పదోతరగతి స్థాయి)
7. డేటా ఇంటర్‌ప్రెటేషన్ (చార్ట్స్, గ్రాఫ్స్, టేబుల్స్, డేటా సఫిషియన్సీ మొదలైనవి - పదోతరగతి స్థాయి)

గత కొన్ని సంవత్సరాలుగా ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, డెసిషన్ మేకింగ్‌ల నుంచి ప్రశ్నలు ఇవ్వడం లేదు. వీటికి సరైన సమాధానాలు ఒకటికంటే ఎక్కువగా ఉండటంతో యూపీఎస్సీ వీటి నుంచి ప్రశ్నలను అడగడం లేదు. ఇప్పుడు కూడా ఇదే పద్ధతిని పాటించే అవకాశం ఉంది.

✦ పేపర్-2ను నిర్లక్ష్యం చేయకూడదు. అలాగే తేలిగ్గానూ తీసుకోకూడదు. ఇదే అర్హతను నిర్దేశిస్తుంది. ఈ పేపర్ సరిగా రాయక ఎంతో మంది తిరస్కరణకు గురయ్యారు.

✦ మ్యాథ్స్ అంత బాగా రానివారు ఈ పేపర్ మీద ఎక్కువ దృష్టి పెట్టాలి. షార్ట్‌కట్ పద్ధతుల మెలకువలు తెలుసుకోవాలి. మ్యాథ్స్ ప్రశ్నలను నిర్లక్ష్యం చేయడమో, వాయిదా వేయడమో చేయకూడదు.

✦ పేపర్-1 కంటే ముందుగానే పేపర్-2 సన్నద్ధతను మొదలుపెట్టాలి. ఎందుకంటే.. ఈ పేపర్ రాయడానికి అవసరమైన నైపుణ్యాలను రాత్రికి రాత్రే సాధించే అవకాశం ఉండదు.



- వి. గోపాలకృష్ణ, డైరెక్టర్, బ్రెయిన్ ట్రీ

తాజా ఇంటర్న్‌షిప్‌లు

విశాఖపట్నంలో యూట్యూబ్ క్రియేషన్

సంస్థ: అయెనింక్స్
స్టైపెండ్: నెలకు రూ.6,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 6
అర్హతలు: వీడియో మేకింగ్ నైపుణ్యం
internshala.com/i/c3d1dd

ఆపరేషన్స్

సంస్థ: అమిగొసర్వీసియెు
స్టైపెండ్: నెలకు రూ.2,000
దరఖాస్తు గడువు: మార్చి 31
అర్హతలు: ఆపరేషన్స్ నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులు
internshala.com/i/75e104

బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)

సంస్థ: ఇఫీడర్
స్టైపెండ్: నెలకు రూ.5,000
దరఖాస్తు గడువు: మార్చి 28
అర్హతలు: సేల్స్ అండ్ మార్కెటింగ్ నైపుణ్యం
internshala.com/i/c120082

వర్క్ ఫ్రమ్ హోమ్

ఫండ్‌రైజింగ్

సంస్థ: తారే జమీన్ ఫౌండేషన్
స్టైపెండ్: నెలకు రూ.1,000
దరఖాస్తు గడువు: మార్చి 31
అర్హతలు: ఫండ్‌రైజింగ్ నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులు
internshala.com/i/bdd9f9

డేటా సైన్స్

సంస్థ: ఫిట్జీఎఫ్
స్టైపెండ్: నెలకు రూ.3,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 10
అర్హతలు: డేటా ఎనలిటిక్స్, డేటా సైన్స్, మెషీన్ లెర్నింగ్, ఎంఎస్-ఎక్సెల్, నాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, పైతాన్, రిసెర్చ్ అండ్ ఎనలిటిక్స్, ఎస్‌క్యూఎల్ నైపుణ్యాలు
internshala.com/i/66eb55

ఫైనాన్స్

సంస్థ: ఫస్ట్ ప్లస్
స్టైపెండ్: నెలకు రూ.3,500-5,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 11
అర్హతలు: అకౌంటింగ్, ఫైనాన్షియల్ లిటరసీ, ఫైనాన్షియల్ మోడలింగ్, ఎంఎస్-ఎక్సెల్ నైపుణ్యాలు
internshala.com/i/e246de

నోటిఫికేషన్స్ ప్రభుత్వ ఉద్యోగాలు

ఈపీఎఫ్‌ఓలో 2674 సోషల్ సెక్యూరిటీ అసిస్టెంట్లు

సంస్థ: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్‌వో), న్యూదిల్లీ ప్రాంతీయ కార్యాలయాల్లో సోషల్ సెక్యూరిటీ అసిస్టెంట్(ఎస్ఎస్ఏ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు: ఎస్ఎస్ఏ- గ్రూప్ సి
మొత్తం ఖాళీలు: 2674 (ఏపీలో 39, తెలంగాణలో 116)
అర్హత: ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిమిషానికి 35 ఇంగ్లిష్ లేదా 30 హిందీ పదాలు కంప్యూటర్‌పై టైప్ చేయాలి.
వయసు: ఏప్రిల్ 26, 2023 నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు సడలింపు.
వేతన శ్రేణి: రూ.29,200 - రూ.92,300.
ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్, కంప్యూటర్ టైపింగ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్‌లతో.
దరఖాస్తు రుసుము: రూ.700(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్-సర్వీస్‌మెన్, మహిళలు ఫీజు చెల్లించవసరం లేదు)
ఆన్‌లైన్ దరఖాస్తుకు గడువు: 26-04-2023
వెబ్‌సైట్: https://www.epfindia.gov.in

ఈపీఎఫ్‌ఓలో 185 స్టెనోగ్రాఫర్లు

పోస్టు: స్టెనోగ్రాఫర్ (గ్రూప్ సి)
అర్హత: పన్నెండో తరగతి ఉత్తీర్ణతతో పాటు స్టెనోగ్రఫీ నైపుణ్యం ఉండాలి.
వయసు: ఏప్రిల్ 26, 2023 నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
వేతన శ్రేణి: రూ.25,500 - రూ.81,100.
ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్, స్టెనోగ్రఫీ స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్‌లతో
దరఖాస్తు రుసుము: రూ.700(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్-సర్వీస్‌మెన్, మహిళలకు మినహాయింపు)
ఆన్‌లైన్ దరఖాస్తుకు గడువు: 26-04-2023
వెబ్‌సైట్: https://www.epfindia.gov.in

ప్రవేశాలు

సైనిక పాఠశాలలో...

తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్), హైదరాబాద్... 2023-24 విద్యా సంవత్సరానికి వరంగల్ జిల్లా అశోక్‌నగర్‌లో బాలుర సైనిక స్కూల్‌లో ఆరో తరగతి (సీబీఎస్ఈ), ఇంటర్మీడియట్(ఎంపీసీ- సీబీఎస్ఈ)లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ఎంపికైన విద్యార్థులకు ఉచిత వసతి, భోజనంతో పాటు దుస్తులు, పుస్తకాలు తదితరాలు అందిస్తారు.
అర్హతలు: ఆరో తరగతికి 2022-23 విద్యా సంవత్సరంలో గుర్తింపు పొందిన పాఠశాల నుంచి ఐదో తరగతి పరీక్షకు హాజరైన/ ఉత్తీర్ణులైన బాలురు అర్హులు. ఇంటర్‌కు 2022-23 విద్యా సంవత్సరంలో గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదో తరగతి పరీక్షకు హాజరైన/ ఉత్తీర్ణులైన బాలురు అర్హులు. విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2,00,000 (పట్టణ ప్రాంతం), రూ.1,50,000 (గ్రామీణ ప్రాంతం) మించకూడదు.
సీట్లు: ఆరో తరగతి- 80, ఇంటర్- 80.
వయసు: ఇంటర్‌కు 01-04-2006 నుంచి 31-06-2008 మధ్య జన్మించినవారు అర్హులు. ఆరో తరగతికి 01-04-2011 నుంచి 31-03-2013 మధ్య జన్మించినవారు అర్హులు.
ఎంపిక: రాత, శారీరక సామర్థ్య, వైద్య పరీక్షలతో.
పరీక్ష ఇలా: ఆరోతరగతి రాత పరీక్షలో.. ఐదో తరగతి సిలబస్ నుంచి మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు 100 ఉంటాయి. తెలుగు(20 మార్కులు), ఇంగ్లిష్(30 మార్కులు), మ్యాథ్స్(30 మార్కులు), సైన్స్(10 మార్కులు), సోషల్ స్టడీస్(10 మార్కులు) సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడుగుతారు. ఇంటర్ రాత పరీక్షలో 8-10వ తరగతి స్థాయిలో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు 100 ఉంటాయి. ఇంగ్లిష్(20 మార్కులు), మ్యాథ్స్(40 మార్కులు), ఫిజిక్స్(20 మార్కులు), కెమిస్ట్రీ(15 మార్కులు), బయాలజీ(5 మార్కులు) సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడుగుతారు.
రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.200.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 08.04.2023.
ప్రవేశ పరీక్ష తేదీ: 30.04.2023.
వెబ్‌సైట్: ww.tgtwgurukulam.telangana.gov.in

అప్రెంటిస్

బీఎస్ఎన్ఎల్, హరియాణ సర్కిల్

భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్), హరియాణ సర్కిల్ అప్రెంటిస్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
గ్రాడ్యుయేట్, టెక్నీషియన్ అప్రెంటిస్: 40 ఖాళీలు
అర్హత: ఏదైనా విభాగంలో డిగ్రీ (టెక్నికల్/ నాన్ టెక్నికల్) లేదా డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: 25 ఏళ్లకు మించరాదు.
స్టైపెండ్: గ్రాడ్యుయేట్‌లకు నెలకు రూ.9000, డిప్లొమా వారికి రూ.8000.
ఎంపిక: డిగ్రీ/ డిప్లొమాలో సాధించిన మార్కులతో
అప్రెంటిస్‌షిప్ వ్యవధి: ఏడాది
దరఖాస్తు రుసుము: లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 15.04.2023.
డాక్యుమెంట్ వెరిఫికేషన్ తేదీ: 26.04.2023.
ఎంపిక జాబితా ప్రకటన: మే 2023 మొదటి వారం.
వెబ్‌సైట్: https://www.bsnl.co.in

బీఎస్ఎన్ఎల్ ఉత్తరాఖండ్‌లో..

భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్), దేహ్రాదూన్ ఉత్తరాఖండ్ టెలికాం సర్కిల్ అప్రెంటిస్ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.
గ్రాడ్యుయేట్, టెక్నీషియన్ అప్రెంటిస్: 21 ఖాళీలు
అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా/డిగ్రీ(ఇంజినీరింగ్/ టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి.
విభాగాలు: టెలికమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, రేడియో, కంప్యూటర్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ.
వయసు: 25 ఏళ్లకు మించరాదు.
స్టైపెండ్: గ్రాడ్యుయేట్లకు నెలకు రూ.9000, డిప్లొమా వారికి రూ.8000.
ఎంపిక: డిగ్రీ/ డిప్లొమాలో సాధించిన మార్కులతో.
దరఖాస్తు రుసుము: లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 10-04-2023.
వెబ్‌సైట్: https://www.bsnl.co.in